క్లుప్తంగా

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి మున్సిపల్ కార్మికుల వినతి

హాలియా : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. 2023 మేడే దినోత్సవం సందర్భంగా ప్రతి మున్సిపల్ కార్మికుడికి పెంచిన రూ.వేయిని 15 నెలలు గడిచినా కార్మికుల అకౌంట్‌లో జమకాలేదన్నారు.కార్మికుల జీతాల నుంచి కట్ అయిన పీఎఫ్ డబ్బులు అకౌంట్‌లో జమ కావడం లేదని, 10నెలలుగా సబ్బు బిల్లులు ఇవ్వడం లేదని తదితర సమస్యలను ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా సమస్యలు పరిష్కరించడాకి కృషి చేస్తానని ఎమ్మెల్యే కార్మికులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు

మిర్యాలగూడ అర్బన్ : మైనర్లు బైక్ డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడితే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని డాహిల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు యువత అలవాటు కాకుండా చిన్నతనంనుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగునంగా చదువును కొనసాగించి ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సాయి నివాస్, ప్రిన్సిపల్కాంత్‌బాబు, కానిస్టేబుల్ కోడిరెక్క కిరణ్, నాగరాజు, క్రాంతి ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా జనార్దన్

కొండమల్లేపల్లి : ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఊరే జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల, పట్టణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కార్యక్రమంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా మిర్యాల శ్రీనివాస్, కోశాధికారిగా ముచ్చర్ల కరుణాకర్లను ఎన్నుకున్నారు. అలాగే ఆర్యవైశ మహాసభ జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సభ్యులు సమాజసేవలో ముందుండాలని కోరారు. మాజీ మండలాధ్యక్షుడు జిన్నం రాంమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరె లక్ష్మణ్, జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి మల్లయ్య, పట్టణాధ్యక్షుడు సముద్రాల ధనయ్య, ప్రధానకార్యదర్శి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బేకరి యజమానికి రూ.3వేలు జరిమానా

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సాగర్ రోడ్డులో ఉన్న బేకరి యాజమాన్యం కుళ్లిన కేక్ విక్రయించినందుకు గురువారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆ బేకరిని సందర్శించారు. అనంతరం కుళ్లిన కేక్‌ను విక్రయించినందుకు బేకరి యాజమానికి రూ.3వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేకరి, హోటళ్లల్లో నాణ్యతతో కూడిన తినుబండారు ఇవ్వాలని, నాణ్యతను పాటించకుంటే ఆ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

నేత్రదానంతో మరొకరికి కంటి చూపు



నేత్రదాన అంగీకార పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న నేత్ర నిధి ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్ : నేత్రదానంతో మరొకరికి కంటి చూపు వస్తుందని డైమాండ్ నేత్రనిధి నిర్వాహకులు మాశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన మంచుకొండ రంగయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. డైమాండ్ నేత్ర నిధి సభ్యులు నేత్రాలను సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు నేత్రదాన అంగీకార పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయబాస్కర్, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ సర్వే

వేములపల్లి (మాడుగులపల్లి) : గ్రామాల్లో రుణమాఫీ యాప్ ద్వారా కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తున్నట్లు ఏడీఏ దేవ్‌సింగ్ తెలిపారు. గురువారం మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్‌లో రైతు రుణమాఫీ కుటుంబ సభ్యుల సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు లేక పంట రుణమాఫీ కాని రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఆయా గ్రామాల్లో నిర్ధేశించిన తేదీల్లో రైతు కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డు వివరాలు వ్యవసాయాధికారులకు అందించాలన్నారు. రైతులందరూ అందుబాటులో ఉండి వ్యవసాయాధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ శివరామ్‌కుమార్, ఏఈఓ వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

లక్షలతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- నిరుపయోగంగా కూరగాయల మార్కెట్ యార్డు
- రోడ్లపై విక్రయాలతో ట్రాఫిక్‌కు అంతరాయం



నిరుపయోగంగా కూరగాయల మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న మడిగలు



రోడ్లపై విక్రయిస్తున్న కూరగాయలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని స్థానిక హైదరాబాద్ బస్టాండు సమీపంలో గత ప్రభుత్వం రూర్బన్ నిధుల కింద రూ.50లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. లక్షలు పోసి నిర్మించిన మార్కెట్‌లో కనీసం పదిరోజులు కూడా వ్యాపారస్తులు కూరగాయలు విక్రయించలేదు. దీనికి ప్రధాన కారణం వినియోగదారులెవరూ రావడం లేదని పేర్కొంటున్నారు. పైగా సొంత మడిగలు ఉన్న వారు తమతమ మడిగలలో కూరగాయలు విక్రయిస్తున్నారు. ఈ కారణంగా చిల్లర వ్యాపారులైన కూరగాయలు విక్రయించే తాము నష్టపోతున్నామని అంటున్నారు. దీంతో చేసేది లేక యథావిధిగా రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. సొంత మడిగలు ఉన్నవారు మార్కెట్‌కు వెళ్లకుండా కోర్టుకు వెళ్లారు. దీంతో సమస్య కోర్టు పరిధిలో ఉండడంతో యథావిధిగా వ్యాపారస్తులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ రద్దీ..

దీని వల్ల నాలుగు కూడలి అయి కొండమల్లేపల్లి నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రూ.50లక్షలు వెచ్చించి 2021 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. కాని ఇప్పటి వరకు ఆ కూరగాయల మార్కెట్ వినియోగంలో ఉండకపోవడం గమనార్హం. అధికారులు చొరవ తీసుకొని కోర్టులో ఉన్న కేసును సమసిపోయే విధంగా వ్యాపారస్తులతో మాట్లాడి సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

పట్టణ కేంద్రంలో సొంత మడిగలు ఉన్నవారు కూరగాయలు అక్కడే విక్రయించుకునేందుకు పంచాయతీ అనుమతి ఇచ్చిందని కోర్టులో కేసు వేశారు. దీంతో కూరగాయల మార్కెట్‌కు ఎవరూ రావడం లేదు. మిగతా వారు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. ఇరువురితో కూర్చొబెట్టి మాట్లాడి సమస్య పరిష్కారమార్గాన్ని తీసుకొచ్చి కోర్టులో ఉన్న కేసు సమసిపోయే విధంగా, కూరగయల మార్కెట్‌ను వాడుకలోకి తీసుకొచ్చే విధంగా ప్రయత్నిస్తాం.

– రాంరెడ్డి, ఎంపీడీఓ, కొండమల్లేపల్లి

గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం : గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవసలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బిట్టు రవి కుమార్, విద్యుత్ ఏఈ రవీందర్ రెడ్డి, ఆలంపల్లి జానయ్య, అనుముల వెంకట్ రెడ్డి, పీబీ రవి, వీరయ్య, వేణు, రవీంద్ర చారీ, వీర య్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఏల్లా సోమి రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స చేయించుకున్నాడు. దీంతో కాంగ్రెస్ నాయకులతో సమాచారం తెలుసుకున్న సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కార్యకర్త సోమిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అనుముల జాన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి గురువారం జాన్‌రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై జాన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గొడవల్లో తలదూర్చితే కఠిన చర్యలు

మిర్యాలగూడ అర్బన్ : గొడవల్లో తలదూర్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇతర గొడవల్లో, సెటిల్‌మెంట్ విషయంలో కలగచేసుకుని దందాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

వేములపల్లి (మాడుగులపల్లి) : వరదకాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం మాడుగులపల్లి మండలంలోని కుక్కడం వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత 28 రోజుల క్రితం వరద కాల్వకు రాష్ట్ర మంత్రులు నీటిని విడుదల చేసినప్పటికీ కాల్వలో పెద్దఎత్తున కంపచెట్లు, రాళ్లు, వ్యర్థాలతో నిండిపోవడంతో చివరి ఆయకట్టు నీరందడం లేదని పది రోజుల కిందట రాస్తారోకో చేపట్టడంతో నీటిని విడుదల చేస్తామని చెప్పి ఇంత వరకు విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలోని మాడుగులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మత్రిగూడెం, తోపుచర్ల గ్రామాల చివరి భూములకు నీరందక రైతులు సాగుచేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరదకాల్వలో పేరుకపోయిన కంపచెట్లను, వ్యర్థాలను తొలగించి చివరి భూముల వరకు సజావుగా నీరందించాలని, లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రైతుల వద్దకు వచ్చి నచ్చజెప్పి ఆందోళనను విరమింపచేశారు. కార్యక్రమంలో రైతులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనునాయక్, ఎలుగురు సైదులు, వెంకన్న, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



హాలియా : ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు



మిర్యాలగూడ : ప్రకాశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

దేవరకొండ : క్రీడాకారులు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. గురవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ 120వ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అంతకు ముందు జెండా ఊపి క్రీడా ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, మున్సిపల్ చైర్మన్ నర్సింహ, తాళ్ల శ్రీధర్‌గౌడ్, వైఎస్ కరుణాకర్, ఉమామహేష్, బత్తుల అమర్, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

మిర్యాలగూడ : మేజర్ ధ్యాన్యన్‌చంద్ జయంతిని పురస్కరించుకోని మండలంలోని అవంతీపురం శ్రీప్రకాశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.రమాకాంతారావు హాకీ చాంపియన్ మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించి గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, ప్రకాశ్, యాదగిరిరావు, విజయ్‌కుమార్, రామచంద్రరావు ఉన్నారు.

హాలియా : ప్రాచీనమైన నాగరికత ఉన్న భారతదేశంలో గ్రామీణ క్రీడలు ఎంతో ఉత్తమమైనవని, పాశ్చాత్య క్రీడలు మన సంస్కృతిని దెబ్బతీస్తున్నాయని చల్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ అన్నారు. జాతీయ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను గురువారం మండలంలోని చల్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా మంత్రీకుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యామలాదేవిని ఘనంగా సన్మానించారు. అదే విధంగా అనుముల మండల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులతో హాలియా బస్టాండ్ నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హాలియాలోని టైం స్కూల్‌లో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టైం స్కూల్ ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి, హాలియా జిల్లా పరిషత్ పీడీ వెంకట్రాంరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చెన్నుపాటి డోమినిక్, యడవెల్లి రాంబాబు, కాకునూరి రమేష్, బుయ్య పరమేష్, చల్మారెడ్డిగూడెం పాఠశాల ఉపాధ్యాయులు షేక్ షర్ఫోద్దీన్, లిల్లీ థెరిస్సా, పల్‌రెడ్డి నిర్మల, పరికె రేణుక, మేకల వెంకట్‌రెడ్డి, కట్టిబోయిన జ్యోతి, కోరేపాక చంద్రకళ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం



బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్, సిబ్బందిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నాగార్జునసాగర్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్ అన్నారు. సాగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసిన ప్రిన్సిపాల్ దారాపాండయ్య, సిబ్బంది మంగమ్మలు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లగా గురువారం కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగి పనిచేసిన కాలంలో ఆయన పాలన పనితీరే గుర్తింపు తెచ్చిపెడుతుందని, భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలలను, పాఠశాలలను కాపాడుకునేందుకు అందరి కృషి అవసరమన్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో కళాశాల ఆవరణలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనసూర్య, అధ్యాపకులు వెంకటయ్య, మహేశ్వర్, ప్రసన్నలక్ష్మీ, గోపాలకృష్ణ, రవీందర్ నాయక్, జనార్థన్, రజబక్‌అలీ, ఉపేంద్రాచారి, సైదమ్మ, శంకర్, మెరీనా, సోమయ్య, జానకిరాములు తదితరులున్నారు. వీడ్కోలు సమావేశంలోనే నూతనంగా విధుల్లో చేరిన ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను సన్మానించారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా తెలుగు అధ్యాపకులు జానకిరాములును ఘనంగా సన్మానించారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తుంగపాడు మోడల్ స్కూల్‌లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బక్కా శ్రీనివాసచారి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, అడావత్ చిన్న వెంకన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి శ్రీనివాస్, మలిగిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నాయకులు డి.వెంకట్‌రెడ్డి, జంగం సైదులు, రాగ్యా నాయక్, వెంకయ్య, జయరాజు తదితరులున్నారు.

డెయిరీ పనులు ఆపాలని కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ లో చేపడుతున్న డెయిరీ నిర్మాణ పనులు ఆపాలని కోరుతూ కలెక్టర్‌కు మాజీ ఎంపీటీసీ ఇస్లావత్ సుజాన బాలునాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం గురువారం అందజేశారు. 50వేల లీటర్ల పాలను మాత్రమే ప్రాసెస్ చేస్తామని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి అనుమతులు పొందారని, గతంలో ఇక్కడ వీటీ డెయిరీ ఉండగా సంఘం డెయిరీ కొనుగోలు చేసి ప్రస్తుతం రెండున్నర లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ ,చేయడానికి నిర్మాణాలు చేపడుతున్నారని, దానిని ఆనుకోని మోడల్ స్కూల్ ఉందని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. ఈ పాలశీతలీకరణ కేంద్రంలో పాలకు వాడే కెమికల్‌తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతారని, అందుకు గాను తక్షణమే ఆ నిర్మాణాన్ని ఆపాలని కోరారు.

సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత సాంబయ్య

మిర్యాలగూడ టౌన్ : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ రాష్ట్ర నేతలు పోతేపాక సాంబయ్య, సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం స్థానిక హౌసింగ్‌బోర్డులో విఘ్నేశ్వర ఎస్టేట్ మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ కార్యశాలలో నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు సైదులు, సత్యప్రసాద్, సరిత. పురుషోత్తంరెడ్డి. అభిరామ్, వేణు, నాయకులు ఉన్నారు.

త్రిపురారం : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కటకం మల్లికార్జున అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో ప్రతి ఆరేళ్లకు ఒక్కసారి సభ్యత్వ నమోదు ఉంటుందని, సభ్యత్వం బాధ్యతగా భావించి ప్రతి బూత్‌లో రెండు వందల వరకు సభ్యత్వాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ్య, కృష్ణ, మహేష్, సోమయ్య, రామకృష్ణ, హుస్సేన్, లింగయ్య, భాస్కర్, సంపత్, లింగయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఎదుట టీఆర్ఎస్వీ ధర్నా

చింతపల్లి :దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి బాలుర పాఠశాల ఎదుట గురువారం టీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌స్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ కొండభీమనపల్లి గురుకుల పాఠశాలలో 13మంది విద్యార్థుల మీద ఎలుకల దాడి సంఘటనకు నిరసనగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్,పిల్లి పారమేష్, రమావత్ విక్కి, పంది హరికృష్ణ, గుండాల వెంకట్, వడత్య గణేష్, కవటి వెంకటేష్, రామవత్ గోపి, అనిల్, రవి, శ్రీను పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ..



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చింతపల్లి : విద్యార్థుల జీవితాలతో బీసీ గురుకుల పాఠశాలలు చెలగాటమాడుతున్నాయని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు గోపీచంద్ అన్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర పాఠశాలలో విద్యార్థులను ఎలుకల దాడిలో విద్యార్థులు గాయపడడంతో గురువారం పాఠశాల ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్‌నె వెంటనే సస్పెండ్‌చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు తెలుసుకోవడానికి పాఠశాల వద్దకు వెళ్లగా లోపటికి రానివ్వకుండా గేటుకు తాళం వేసి లోనికి రాకుండా పాఠశాల యాజమాన్యం అడ్డుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రెటరీ అంకూరి శ్రీకాంత్, విక్రమ్, వినయ్, అనిల్, అరవింద్ పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక



మిర్యాలగూడ : అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



డిండి : బోనాలను ఎత్తుకొని బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



చింతపల్లి : బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మిర్యాలగూడ : పండుగలు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాపూజీనగర్‌లో నిర్వహించిన బోనాల పండుగలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు. మహిళలు పెద్దఎత్తున బోనాలను అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో గురువారం బోనాల పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవరకొండ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో దుర్గానగర్ నగర్ కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో ముత్యాలమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చింతపల్లి : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి పండుగ సందర్భంగా పెద్దమ్మ తల్లి, ముత్యాలమ్మ ఆలయాలలో పూజలు నిర్వహించి ప్రత్యేక బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, చింతపల్లి మాజీ జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, గ్రామ మాజీ ఉప సర్పంచ్ ప్రేమలత పరమేశ, మాజీ వార్డు సభ్యులు శ్రీను, గ్రామ పెద్దలు వినోదమ్మ, ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గాంధీనగర్ కలాల్‌వాడ ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రోశయ్య, మాజీ వైస్ చైర్మన్ సైదులు, శ్రీనివాస్, రామస్వామి, వెంకన్న, శేఖర్, శ్రీనివాస్, రాంబాబు, దుర్గాప్రసాద్, రవి, శ్రీనివాస్, భిక్షం, మురళి, సైదులు, దుర్గయ్య, రమేష్, మట్టయ్య, సోములు తదితరులు పాల్గొన్నారు.

డిండి : మండల కేంద్రంలోని పోచమ్మ తల్లీ బోనాల పండుగ గురువారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనమెత్తిన మహిళలు బొడ్రాయి వద్ద నుంచి డప్పు చప్పుళ్లతో బయలుదేరి పోతురాజుల విన్యాసాల నడుమ గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ పోచమ్మ గుడికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల సాయమ్మ, ఉప సర్పంచ్ నూకం వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు ఏటి.రాధిక,బూషిపాక వెంకటయ్య, నాయకులు కేశవులు, సాయికుమార్, కాశన్న, ఏటి.కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్ ఉన్నారు.

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

త్రిపురారం : ఓపెన్ జిమ్‌లను ప్రజలు సద్వినిమెుగం చేసుకోవాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో నిడమనూరు మండలంలోని వేంపాడే గ్రామ పంచాయతీ పరిధిలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ. 5 లక్షల నిధుల మంజూరు ఎంసీ కోటిరెడ్డి కృషి చేశారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడలపై దృష్టి సారించాలని, దేహదారుఢ్యానికి ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు వెంకటరామారావు, పోలె డేవిడ్, ఆర్ సామవతి, అశోక్ యాదవ్, బత్తుల సుజన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కింద వంటలు.. సహపంక్తి భోజనాలు



పెద్దఅడిశర్లపల్లి : ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సభ్యులు



పెద్దవూర : బట్టుగూడెంలో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం, పెద్దవూర, ముసల్మచెట్టుస్టేజీ, చింతపల్లి, తుంగతుర్తి, చలకుర్తి, పర్వేదుల, ఊట్లపల్లి, పులిచర్ల, కుంకుడుచెట్టు తండా, పెద్దగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి, కొత్తలూరు, శిర్సనగండ్ల, వెల్మగూడెం తదితర గ్రామాల్లో గురువారం వనవాసం వెళ్లి చెట్లకింద వంటలు వండుకుని, అక్కడే పిల్లాపాపలతో భోజనాలు చేశారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం అన్ని గ్రామాల్లో వనవాసం వెళ్తుంటారు. మండలంలోని బట్టుగూడెం గ్రామంలో డప్పు వాయిధ్యాలతో ఊరేగింపు నిర్వహించి బొడ్రాయి, కోటమైసమ్మతల్లి, ముత్యాలమ్మ, ఈదమ్మ వంటి గ్రామ దేవతలకు మేకపోతులను బలిచ్చారు.

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలో గురువారం శ్రావణమాస వనవాసాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు తమ వ్యవసాయ పొలంలోకి వనవాసం వెళ్లారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఏకేబీఆర్‌లో పార్కులో మండల ఆర్యవైశ్యులు శ్రావణమాస వనవాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెకటేశ్వర్లను మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ నర్సింహా, శ్రీనివాస్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామయ్య, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్, వీరమల్ల పరమేష్, దొడ్డి లక్ష్మయ్య, జగన్, మంచాల బాబు, శ్రీను, సతీష్ ఉన్నారు.